క్లుప్తంగా

వాహనాల తనిఖీ

సూర్యాపేటటౌన్ : జిల్లా కేంద్రంలో కొత్త బస్టాండ్ వద్ద ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం ఆధ్వర్యంలో ఆదివారం వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సరైన ధ్రువపత్రాలు, నంబర్ ప్లేట్లు లేని వాహనాలను సీజ్ చేశారు. అనంతరం ఎస్ఐ మాట్లాడారు. వాహనదారులు వాహనాల ధ్రువీకరణ పత్రాలు, లైసెన్స్ కలిగి ఉండాలని పేర్కొన్నారు.

న్యూడెమోక్రసీ సీనియర్ నాయకుడు మృతి



వెంకటేశ్వర్లు మృతదేహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నూతనకల్ : మండల పరిధిలోని చిల్పకుంట్ల గ్రామానికి చెందిన సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ సీనియర్ నాయకుడు, అభ్యుదయ ఉన్నత పాఠశాల వ్యవస్థాపకుడు మహంకాళి వెంకటేశ్వర్లు (60) అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం హైదరాబాద్‌లో మృతి చెందాడు. దీంతో అతడి మృతదేహాన్ని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకుడు బత్తుల సురేష్ సందర్శించి పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో నాయకులు బిక్కి ప్రవీణ్, జటంగి సంతు, గడ్డం మోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



జాజిరెడ్డిగూడెంలో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న అధికారులు

అర్వపల్లి : సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల సామాజిక ఆరోగ్య అధికారి ఎల్.చరణ్ కోరారు. జాజిరెడ్డిగూడెంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నెహ్రూనాయక్, హెల్త్ అసిస్టెంట్ కుంభం వీరయ్య, గ్రామపంచాయతీ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పోచమ్మ అమ్మవారికి సారె, ఒడి బియ్యం సమర్పణ



వేడుకల్లో పాల్గొన్న మహిళలు

హుజూర్‌నగర్ : ఆషాఢమాసం చివరి ఆదివారాన్ని పురస్కరించుకుని హుజూర్‌నగర్ పట్టణంలో శ్రీశైవక్ వనిత శక్తి కమిటీ ఆధ్వర్యంలో మహిళలు స్థానిక పోచమ్మ అమ్మవారికి సారె, ఒడి బియ్యం సమర్పించారు. ఈ సందర్భంగా మహిళలు రకరకాల పిండి వంటలు చేసుకుని వచ్చి అమ్మవారికి సమర్పించారు. అమ్మవారికి సారె, ఒడి బియ్యం పోసి, పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సకాలంలో వానలు కురిసి పంటలు పండాలని, ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు టి.నాగలక్ష్మి, కార్యదర్శి టి.సుజాత, కోశాధికారి వి.పద్మ, తదితరులు పాల్గొన్నారు.

నీటి విడుదలపై ప్రభుత్వం స్పందించాలి

చిలుకూరు : నీటి విడుదలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొడ్డా వెంకటయ్య డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కృష్ణానది పరివాహక ప్రాంతాలలో భారీ వర్షాలు కురుస్తున్నందున సాగర్‌కు స్వల్పంగా నీటి ప్రవాహం ప్రారంభమైనందున ప్రభుత్వం నీటి విడుదలపై స్పందించాలని కోరారు. నీటి విడుదలపై ప్రకటన చేస్తే ఆయకట్టులోని రైతులు వడ్లు చల్లుకొని ముందస్తుగా నారుమడులు సిద్ధం చేసుకుంటారని అన్నారు. ప్రభుత్వం వెంటనే సాగర్ నీటిపై షెడ్యూల్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గత సంవత్సరం నీరు రాక, వర్షాలు సక్రమంగా కురవక పంటలు ఎండిపోయి రైతులు నష్టపోయారని తెలిపారు. ఈ ఏడాదైనా ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని అన్నారు.

నోట్‌పుస్తకాలు, పలకలు పంపిణీ

నడిగూడెం : నడిగూడెం గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు, కాంగ్రెస్ నాయకుడు వల్లెపు శ్రీనివాస్ ఆదివారం మండల కేంద్రంలోని ఎస్సీకాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో 55మంది విద్యార్థులకు స్వచ్ఛందంగా నోటుపుస్తకాలు, పలకలు, పెన్నులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గుంజ పెదవెంకన్న, చిన వెంకన్న, పల్లపు తిరుమలేష్, గుంజ తిరుమలేష్, దేవరంగుల రాము, పల్లపు నాగరాజు, దేవరంగుల యల్లయ్య, గుంజ మురళి, రాజశేఖర్, శ్రీకాంత్, నాగరాజు పాల్గొన్నారు.

వానరాల గుంపు.. జనాల్లో వణుకు

- తిరుమలగిరిలో గుంపులుగా సంచరిస్తున్న కోతులు
- తరిమేందుకు ప్రయత్నిస్తే దాడులకు పాల్పడుతున్న వైనం
- ఇబ్బందులు పడుతున్న మున్సిపాలిటీ ప్రజలు



తిరుమలగిరిలో రోడ్డుపై గుంపులుగా తిరుగుతున్న కోతులు

తిరుమలగిరి : తిరుమలగిరి మున్సిపాలిటీ కేంద్రంలో కోతుల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో బయటికి వెళ్లాలంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొన్నది. తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని 15 వార్డులలో ఎక్కడ చూసినా కోతులు గుంపులుగా సంచరిస్తున్నాయి. ఇళ్లలోకి ప్రవేశించి వంట పాత్రలను, తినే పదార్థాలను ఎత్తుకెళ్తున్నాయి. కోతులు ఇళ్ల పైకప్పులను ధ్వంసం చేస్తుండడంతో వర్షాలకు ఇళ్లు కురుస్తున్నాయని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. కోతుల గుంపును తరిమేందుకు ప్రయత్నించిన వారిపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. మున్సిపాలిటీ అధికారులు స్పందించి కోతుల బెడద సమస్యను పరిష్కరించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

కోతులు గాయపరిచాయి

ఉదయం ఫ్రెండ్స్‌తో కలిసి వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్నింగ్ వాక్‌కు వెళ్లాం. ఆ సమయంలో ఒకేసారి కోతుల గుంపు మీద పడి గాయపరిచాయి. వెంటనే స్థానిక ఆస్పత్రిలో ఇంజక్షన్ తీసుకున్నాను.

- కందుకూరి కృష్ణమాచారి, విశ్రాంత ఉద్యోగి

నివారణ చర్యలు తీసుకోవాలి

ఇంటి తలుపులు తెరిస్తే కోతులు ఇంట్లోకి ప్రవేశించి కూరగాయలు, పండ్లు, ఇతర వస్తువులు తీసుకెళ్తున్నాయి. అడ్డుకునే వారిపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. కోతుల బెడద నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

- అబ్బాస్, తిరుమలగిరి

నారాయణరెడ్డి సేవలు మరువలేనివి



సినారె చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, మీలా మహదేవ్ తదితరులు

భానుపురి : తెలుగు సాహిత్య రంగానికి సినారె అందించిన సేవలు మరువలేనివని సుధాకర్ పీవీసీ అధినేత మీలా మహదేవ్ అన్నారు. కవి సింగిరెడ్డి నారాయణరెడ్డి 93వ జయంతి వేడుకల సందర్భంగా ఆది వారం సూర్యాపేటలో శ్రీ జ్ఞాన సరస్వతి సాంస్కృతిక కళావేదిక ఆధ్వర్యంలో స్వరాభిషేకం పాటల విభావరి నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, మీలా మహదేవ్‌లు కవి నారాయణ రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కళావేదిక అధ్యక్ష కార్యదర్శులు బుర్రి వెంకటేశ్వర్లు, గుండా రమేష్, ఎన్సీ రోజా, అమీద్ ఖాన్, రాధాకృష్ణారెడ్డి, నాగవల్లి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీల సంఘం మండల అధ్యక్షుడిగా సత్యనారాయణ



సత్యనారాయణ

చివ్వెంల : ఆర్ఎంపీల సంఘం మండల అధ్యక్షుడిగా సోల్లెటి సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం ఉండ్రుగొండలో నిర్వహించిన ఆ సంఘం మండల కమిటీ సమావేశంలో అతడిని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా గుడిసె రామక్రిష్ణ, గౌరవ అధ్యక్షుడిగా మోగదాల నాగరాజు, ఉపాధ్యక్షుడిగా ఎస్.సైదులు, కోశాధికారిగా వేలాద్రి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఉపేందర్, ఈసీ సభ్యులుగా అశోక్, మైబెల్లి, శోభన్, శ్రీను, సతీష్, రమేష్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు తస్నీర్ సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు పోనుగోటి భుజంగరావు, గునగంటి వెంకన్న, రవి తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో అనఘాష్టమి వ్రతం



సాయిబాబా ఆలయంలో వ్రతంలో పాల్గొన్న భక్తులు

భానుపురి : అనఘాష్టమి వ్రతంతో శుభాలు కలుగుతాయని శ్రీసాయి మందిరం అధ్యక్షుడు కర్నాటి రవికుమార్ అన్నారు. ఆదివారం పట్టణంలోని సాయినగర్‌లో గల సాయిబాబా మందిరంలో అనఘాష్టమి వ్రతం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనఘాష్టమి వ్రతం ఆచరించడంతో తెలిసి తెలియక చేసిన పాపాలు తొలగిపోతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మందిర కోశాధికారి పోతుగంటి మల్లికార్జున్, అర్చకులు వలివేటి విశ్వేశ్వర శర్మ, గంగాధర శర్మ, పద్మావతి, సోమ రాజ్యలక్ష్మి, బచ్చు నీరజ, బొమ్మిడి పద్మ, నూక భవాని, విజయలక్ష్మి, జ్యోతి పాల్గొన్నారు.

గ్రామాల్లో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

- పంచాయతీరాజ్, వైద్యశాఖల ఆధ్వర్యంలో నిర్వహణ
- పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న అధికారులు



అడివెంలలో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సందీప్‌కుమార్



జాజిరెడ్డిగూడెంలో ఖాళీ టైరులో నిలిచిన నీటిని తొలగిస్తున్న వైద్యసిబ్బంది

అర్వపల్లి : ఎడతెరపి లేకుండా కురుస్తున్న ముసురుతో గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య ఏర్పడుతోంది. ముసురు ప్రభావంతో గ్రామాల్లో వీధులు, రోడ్లపై వర్షపునీరు చేరి బురదమడుగులను తలపిస్తున్నాయి. దీంతో వ్యాధులు ప్రభలే అవకాశం ఏర్పడింది. కొన్ని గ్రామాల్లో అప్పుడే ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. కాగా గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా పంచాయతీరాజ్, వైద్యశాఖల ఆధ్వర్యంలో తగు చర్యలు చేపట్టారు.

గ్రామగ్రామాన పారిశుద్ధ్య పనులు..

అన్ని గ్రామాల్లో గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపట్టారు. వీధుల్లో పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం తొలగించడంతోపాటు మురుగు కాలువలను శుభ్రం చేయిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో అవసరమైనచోట బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తున్నారు. పారిశుద్ధ్యంపై వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రజలను చైతన్యపరుస్తున్నారు. ముఖ్యంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచిస్తున్నారు. పలు గ్రామాల్లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షలు చేపడుతున్నారు. సీజనల్‌గా వచ్చే కలరా, మలేరియా, టైఫాయిడ్, డెంగీ వ్యాధుల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచిస్తున్నారు. ఇళ్ల పరిసరాల్లో నీళ్లు నిలువ ఉండకుండా చూడాలని అధికారులు తెలుపుతున్నారు.

అప్రమత్తంగా ఉండాలి



వర్షాలతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశముంది. ప్రజలు ప్రధానంగా పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. జ్వరాలతోపాటు ఎలాంటి వ్యాధులు వచ్చినా వెంటనే వైద్యసిబ్బందిని సంప్రదించాలి. ఇళ్లలో దోమలు, ఈగలు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

- డాక్టర్ సీహెచ్.మణిదీప్, మండల వైద్యాధికారి

పారిశుద్ధ్య పనులు చేపడుతున్నాం



వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడుతున్నాం. వీధుల్లో పిచ్చిమొక్కలు, గడ్డి, చెత్తను తొలగించే పనులు జరుగుతున్నాయి. పారిశుద్ధ్య కార్మికులను అప్రమత్తం చేసి పనులు చేయిస్తున్నాం. అవసరమైన చోట బ్లీచింగ్‌పౌడర్ చల్లించి, నీటి ట్యాంక్‌లు శుభ్రం చేయిస్తున్నాం.

- డి.సందీప్‌కుమార్, ఎంపీడీఓ

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



అర్వపల్లి : కోడూరులో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే



నాగారం : పసునూర్‌లో..

అర్వపల్లి : మండల పరిధిలోని కోడూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు చెంచెల శ్రీనివాస్ తల్లి అనసూర్యమ్మ మృతిచెందారు. దీంతో ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే మందుల సామేల్ పరామర్శించారు. మృతురాలి చిత్రపటానికి నివాళులర్పించారు. అలాగే కొమ్మాల గ్రామంలో నిరుపేద కుటుంబీకురాలైన గడ్డం యల్లమ్మ మృతిచెందగా ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబీకులకు రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. సూర్యనాయక్‌తండాలో బానోతు భాంగ్య మృతిచెందగా నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి రూ.5వేలు ఆర్థకసాయం అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో బ్లాక్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, మోరపాక సత్యం, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఇందుర్తి వెంకట్‌రెడ్డి, యూత్‌కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుడిపల్లి మధుకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు ఎల్.స్వాతిరవీందర్‌నాయక్, సురేష్, బైరబోయిన మహరాజు, పూర్ణచంద్రారెడ్డి, గంగదెరి శ్రీనివాస్, ఉదయ్, కె.సైదులు, తిరుమల్‌రావు, కర్ణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నాగారం : పసునూరు గ్రామానికి చెందిన అంబటి వెంకటయ్య ఆదివారం మృతి చెందారు. దీంతో అతడి మృత దేహాన్ని స్థానిక శాసన సభ్యుడు మందుల సామేల్ సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబానికి రూ.5000 ఆర్థికసాయం అందించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు తొడుసు లింగయ్య, శ్రీనివాస్, నరేష్, వెంకన్న, యాదగిరి, శ్రీను పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు విస్మరిస్తే ఉద్యమాలు తప్పవు



మాట్లాడుతున్న చంద్రశేఖర్

తిరుమలగిరి : పాలకులు ప్రజా సమస్యలు విస్మరిస్తే ఉద్యమాలు తప్పవని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్న చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం తిరుమలగిరిలోని స్థానిక మల్లీశ్వరి థియేటర్‌లో నిర్వహించిన మండల విస్తృత నిర్మాణ కౌన్సిల్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పేదలకు ఇచ్చే రేషన్ బియ్యంలో నాణ్యత ఉండడంలేదని అన్నారు. ప్రభుత్వం తక్షణమే సన్న బియ్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేదలకు ఉచిత విద్య, వైద్యం, నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు, ఉపాధి కల్పిస్తే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎల్లెంల యాదగిరి, కంబాల శ్రీనివాస్, దేవర మల్లీశ్వరి, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు ఉత్పతల కోటమ్మ, మండల కార్యదర్శి ఫయాజ్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి జంపాల మల్లయ్య, ఎండీ ఇక్బాల్, శ్రీకాంత్, వెంకన్న, మల్లయ్య, సైదులు, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ముసురుతో అధ్వానంగా పల్లెదారులు



బురదమయంగా ఉన్న పర్సాయపల్లి లింక్‌రోడ్డు



బొల్లంపల్లి రోడ్డు ఇలా..

అర్వపల్లి : ఇటీవల కురిసిన ముసురు వర్షాలకు పల్లెదారులు అధ్వానంగా మారాయి. కొన్ని గ్రామాల లింక్‌రోడ్లు బురదమడుగులను తలపిస్తున్నాయి. మండలంలోని బొల్లంపల్లి, వేల్పుచెర్ల గ్రామపంచాయతీల రోడ్లు బురదమడుగుల్లా మారి పాదచారులు సైతం నడిచి వెళ్లలేని విధంగా ఉన్నాయి. ఈ రోడ్లపై వాహనాలు అదుపుతప్పి బోల్తా పడుతున్నాయి. వారం రోజుల కిందట వేల్పుచెర్ల రోడ్డుపై ప్రైవేటు పాఠశాలకు చెందిన బస్సు పిల్లలతో వెళ్తుండగా బురదలో అదుపుతప్పి చెట్లలోకి దూసుకెళ్లింది. డ్రైవర్ అప్రమత్తత వహించడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రభుత్వం స్పందించి బురదమడుగుల్లా మారుతున్న రహదారుల సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



విద్యార్థులకు నోట్‌పుస్తకాలు పంపిణీ చేస్తున్న శ్రీనివాస్

పనులు చేయకుండానే నిధులు డ్రా!

- రూ.10.37లక్షలు తీసినట్లు కార్యదర్శిపై నెమ్మికల్ గ్రామస్తుల ఆరోపణ

ఆత్మకూర్(ఎస్) : ఎలాంటి పనులు చేయకుండానే పంచాయతీ కార్యదర్శి నిధులను డ్రా చేశాడని నెమ్మికల్ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ విషయం గ్రామంలోని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. నెమ్మికల్ గ్రామంలో రెండు నెలల క్రితం ఇన్‌చార్జ్ బాధ్యతలు చేపట్టిన పంచాయతీ కార్యదర్శి గ్రామంలో ఎలాంటి పనులు చేపట్టకున్నా రూ.10,37,147 డ్రా చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. సర్పంచ్‌లు, వార్డ్ మెంబర్ల పదవీకాలం పూర్తి కాగానే ప్రత్యేక బాధ్యతలు చేపట్టిన పంచాయతీ కార్యదర్శులు, అధికారులు తమ ఇష్టానుసారంగా నిధులను దుర్వినియోగం చేస్తున్నారని, వీటి మీద కలెక్టర్ విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

చేసిన పనులకే బిల్లులు డ్రా చేశాం

నెమ్మికల్ గ్రామ పంచాయతీలో అభివృద్ధి పనులు చేశాం. ప్రతి పనికి బిల్లులు ఉన్నాయి. గతంలో చేసిన పనులకు, ఇటీవల చేసిన పనులకు సంబంధించిన రికార్డులు, బిల్లులు ఉన్నాయి. వాటి ఆధారంగానే డబ్బులు డ్రా చేశాం. గ్రామంలో కొంతమంది కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారు.

- సుధాకర్, పంచాయతీ కార్యదర్శి

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం



నూతనకల్ : రవీందర్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జెన్నారెడ్డి వివేక్‌రెడ్డి

అర్వపల్లి : అర్వపల్లి విద్యుత్ లైన్‌మెన్ మేడే రాజేష్(47) ఆదివారం మృతి చెందారు. దీంతో అతడి అంత్యక్రియల కోసం విద్యుత్‌శాఖ నుంచి మండల విద్యుత్ ఏఈ వాస శ్రీకాంత్, సబ్ ఇంజనీర్ అనుములపురి గిరిబాబు రూ.20వేలు అందజేశారు. మృతుడికి స్థానిక విద్యుత్ ఫోర్‌మెన్ మల్లయ్య, లైన్ ఇన్‌స్పెక్టర్లు జోయల్, ఎల్.వెంకటేశ్వర్లుతోపాటు సిబ్బంది, తదితరులు నివాళులర్పించారు.

నూతనకల్ : మండల పరిధిలోని పెద నెమిల గ్రామానికి చెందిన కందాల రవీందర్‌రెడ్డి ఇటీవల మృతి చెందారు. దీంతో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు జెన్నారెడ్డి వివేక్‌రెడ్డి ఆదివారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి రేసు రాములు, మస్కాపురం వెంకన్న, గుండగాని వెంకన్న, కాసోజు ఉపేందర్, కనకం వెంకన్న, రవి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

హామీలను తుంగలో తొక్కిన కాంగ్రెస్



సమావేశంలో మాట్లాడుతున్న నాగయ్య

మునగాల : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో విద్యార్థులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీని తుంగలో తొక్కిందని ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) జిల్లా అధ్యక్షుడు నల్లగొండ నాగయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ పీడీఎస్‌యూ, పీవైఎల్ ఆధ్వర్యంలో ఈ నెల 31న చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం హామీలను నెరవేర్చి విద్యార్థులు, నిరుద్యోగులను ఆదుకోవాలని, లేకుంటే ఉద్యమాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. విద్యార్థులు, నిరుద్యోగులకు బడ్జెట్‌లో కనీస ప్రాధాన్యం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కపిల్‌సిబాల్ నివేదిక ప్రకారం 30శాతం నిధులు కేటాయిస్తేనే విద్యారంగానికి న్యాయం జరుగుతుందని చెప్పినప్పటికీ కనీస ప్రాధాన్యం ఇవ్వలేదని అన్నారు. విద్యారంగానికి కేవలం ఏడు శాతం కేటాయించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ప్రతి గ్రామంలో సీజనల్ వ్యాధుల పట్ల వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బందిని అప్రమత్తం చేసి సరైన ప్రజలకు వైద్యం అందించాలని కోరారు. ఈ సమావేశంలో పీవైఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ధరావత్ రవి, జిల్లా కోశాధికారి బండి రవి, జిల్లా నాయకులు పొన్నం బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

సాగర్ నీటితో చెరువులు నింపాలి

చిలుకూరు : సాగర్ నీటిని విడుదల చేసి మండలంలోని చెరువులు, కుంటలను నింపి ప్రజలను ఆదుకోవాలని టీడీపీ రాష్ట్ర నాయకుడు కొల్లు నర్సయ్య డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో సరైన వర్షాలు లేక బావులు, బోర్లు, చెరువులు ఎండి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తక్షణమే సాగర్ నీటిని విడుదల చేసి ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ కింద రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డా గురవయ్య, నాయకులు కొండా సోమయ్య, కొల్లు సత్యనారాయణ, మస్తాన్, శ్రీమన్‌నారాయణ, ఆదినారాయణ, శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సూర్యక్షేత్రంలో ప్రత్యేక పూజలు



సూర్యక్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురంలో అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ఆదివారం ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున ఉషాపద్మిని ఛాయ సమేత సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు జరిపించారు. యజ్ఞశాలలో మహాసౌరహోమం నిర్వహించారు. క్షేత్ర ఆవరణలోని కార్యసిద్ధి వీరహనుమాన్, శ్రీరామకోటి స్థూపాలను భక్తులు దర్శించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో క్షేత్ర వ్యవస్థాపకుడు, సౌర ఆరాధకులు జనార్దన్‌స్వామి, గణపురం నరేష్, బీరవోలు ఇంద్రారెడ్డి, అర్చకులు మిర్యాల రామశర్మ, వేణుగోపాలశర్మ, భక్తులు పాల్గొన్నారు.

31న చలో అసెంబ్లీ

హుజూర్‌నగర్ : విద్యారంగ సమస్యలపై ఈ నెల 31న నిర్వహించే చలో అసెంబ్లీని విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ డివిజన్ అధ్యక్షుడు కామాల ఉదయ్ కోరారు. ఆదివారం పట్టణంలోని శ్రామికభవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బడ్జెట్‌లో ప్రభుత్వం విద్యారంగానికి 7.3శాతం మాత్రమే నిధులు కేటాయించి చేతులు దులుపుకుందన్నారు. బడ్జెట్‌లో విద్యార్థులకు, నిరుద్యోగులకు కనీస ప్రాధాన్యం ఇవ్వలేదని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు భాను, ప్రవీణ్, మధు, గౌతమ్, ముఖేష్ పాల్గొన్నారు.

నూతన చట్టాలతో ఇబ్బందులు

హుజూర్‌నగర్ : కేంద్రం తీసుకొచ్చిన నూతన చట్టాలతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్నగౌడ్ అన్నారు. ఆదివారం పట్టణంలో హమాలీ యూనియన్ నాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కేంద్రం కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా తీసుకురావడంతో కార్మికులు పీఎఫ్, ఇతర సౌకర్యాలు పొందలేకపోతున్నారని అన్నారు. ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జి.సంజీవరెడ్డి నేతృత్వంలో కేంద్ర కార్మిక సంఘాలతో సమావేశం నిర్వహించి దేశ వ్యాప్తంగా కార్యాచరణ చేపట్టబోతున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు చింతకాయల రాము, కందుల వెంకన్న, గుంజ వెంకన్న, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగన్న గౌడ్